ప్రజాశక్తి

గురువారం 8 ఆగస్టు 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

స్థాయి దక్కించుకున్న టిడిపి



విజేతలతో జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్

- ఆ పార్టీకి చెందిన 10 మంది అభ్యర్థులూ గెలుపు
- అనర్హత ఓట్లను లెక్కించినందునే గెలిచారంటూ వైసిపి ఆందోళన
- ఓటమి చెందారనే ఆరోపణలు : టిడిపి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జివిఎంసి) స్థాయీ సంఘం ఎన్నికల్లో టిడిపి కూటమికి చెందిన 10 మంది అభ్యర్థులూ గెలుపొందారు. దీంతో కూటమిలో జోష్ పెరిగింది. మరోపక్క అనర్హతా ఓట్లను లెక్కించినందునే గెలిచారంటూ వైసిపి ఆరోపిస్తోంది. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ స్థాయీ సంఘం ఎన్నికలు జరగ్గా టిడిపి నుంచి 10 మంది, వైసిపి నుంచి 10 మంది బరిలో నిలిచారు. ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత జరిగింది. మొత్తం 97 మందికిగానూ 96 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నగర పాలక సంస్థపై కూటమి పట్టు

జివిఎంసి స్థాయీ సంఘంపై టిడిపి కూటమి పట్టు సాధించింది. జివిఎంసిలో కార్పొరేటర్లపరంగా చూస్తే వైసిపికే మొన్నటి వరకూ బలం ఎక్కువ. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం కోల్పోవడంతో పలువురు కార్పొరేటర్లు టిడిపి, జనసేనల్లోకి గోడదూకారు. ఆ ఫిరాయింపుల కారణంగా వైసిపి బలహీన పడింది. దీంతో స్థాయీ సంఘాన్ని వదులుకుంది. భవిష్యత్‌లో జరిగే కార్పొరేషన్ ఎన్నికలపైనా పట్టు బిగించేందుకు కూటమి పార్టీలు సన్నాహాలు చేస్తున్నాయి.

ఓట్ల లెక్కింపులో గందరగోళం

ఓట్ల లెక్కింపు సందర్భంగా జివిఎంసి అధికార మిగతా 2లో..

విజేతలైన టిడిపి కార్పొరేటర్లకు లభించిన ఓట్లు

విల్లూరి భాస్కరరావు	66
గొలగాని వీరారావు	64
పిసిని వరహా లక్ష్మీనరసింహ	65
గల్లా పోలిపల్లి	64
బొమ్మిడి రమణ	64
బల్ల శ్రీనివాసరావు	60
శరగడం రాజశేఖర్	60
నొల్లి నూకరత్నం	58
పులి లక్ష్మీబాయి	56
పిల్లా మంగమ్మ	54



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రుచి, నాణ్యతతో మధ్యాహ్న భోజనం

విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులకు పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజనం కోసం బడికి వచ్చే విద్యార్థులు చాలామంది ఉన్నారని, అటువంటి పరిస్థితుల్లో పిల్లలు ఇష్టపడి తినేలా ఆహారం మరింత నాణ్యత కలిగి ఉండాలని స్పష్టం చేసారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం అమలుపై విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్టీరింగ్, పర్యవేక్షణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును స్వయంగా పరిశీలించినట్టు తెలిపారు. వాటిలో రైస్ మినహా మిగిలిన మెనూ అంతా బాగుందని తెలిపారు. మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే బియ్యం బాగాలేకపోతే వాటిని తిప్పి పంపాలని సూచించారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఈ పథకాన్ని మరింత పటిష్టంగా అమలుచేయాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో 584 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. వాటిలో 61,228 మంది విద్యార్థులు మిగతా 2లో..

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ తగదు

▶ వార్త 2లో..

నూతన క్రిమినల్ చట్టాలపై నేడు ఐలు నిరసన

▶ వార్త 2లో..

సూర్యనారాయణకు ఘననివాళి

▶ వార్త 5లో..

వాల్తేరు డివిజన్ పరిధిలో..

త్వరలో యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ విభాగం



వివరాలు వెల్లడిస్తున్న మోహన్‌రావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్‌లో గంజాయి అక్రమ రవాణా నివారణకు యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్టు ప్రభుత్వ రైల్వే పోలీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ బి.మోహన్‌రావు తెలిపారు. బుధవారం ఉదయం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫారం -1లోగల గవర్నమెంట్ రైల్వే పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ఏడాది జనవరి నుండి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే పోలీసులు సంయుక్తంగా 134 కేసులను నమోదు చేశారని, 2545 కేజీల గంజాయిని సీజ్ చేశామని వెల్లడించారు. వీటి విలువ ప్రస్తుత మార్కెట్లో 1.25 కోట్లకుపైగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఈ కేసులలో 177 మంది నిందితులతో పాటు 11 మంది జువైనల్సును కూడా అరెస్టు చేశామన్నారు. వారంతా ఒడిశా నుండి విశాఖ మీదుగా దక్షిణ భారత రాష్ట్రాలైన కేరళ, తమిళనాడులతో పాటు, ఉత్తర భారత రాష్ట్రాలైన ఢిల్లీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలకు ఈ గంజాయి రవాణా చేస్తున్నారని గుర్తించామని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో ఆర్‌పిఎఫ్ పోస్ట్ కమాండర్ కె.రామకృష్ణ, జిఆర్‌పి విశాఖపట్నం ఎస్‌హెచ్‌ఒ సిహెచ్.ధనుంజయ నాయుడు, విశాఖపట్నం లయన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు, జిఆర్‌పి ఎస్‌ఐ కె.శాంతారావు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో ప్రతి మార్కూ కీలకం

- నెగ్గేందుకు చదవడం ఒక్కటే సరిపోదు.. లోకజ్ఞానం అవసరం
- ఎమ్మెల్సీ, ప్రముఖ కోచింగ్ నిపుణులు కెఎస్.లక్ష్మణరావు
- అల్లూరి విజ్ఞాన కేంద్రం, యుటిఎఫ్ ఆధ్వర్యాన డిఎస్‌సి, టెట్‌పై అవగాహనా సదస్సు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, వేదికపై సిహెచ్.నర్సింగరావు తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోటీ పరీక్షలలో ప్రతి మార్కూ అత్యంత ప్రధానమైనదని, మెగా డిఎస్‌సి, టెట్ వంటి పోటీ పరీక్షలలో నెగ్గాలంటే కేవలం చదివితేనే సరిపోదని, లోకజ్ఞానం కూడా ఉంటేనే విజయం సాధించవచ్చునని ప్రముఖ కోచింగ్ నిపుణులు, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మెగా డిఎస్‌సి, టెట్ పోటీ పరీక్షలపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలలో వచ్చే ప్రశ్నలకు సంబంధించి ఉద్యోగార్థులు అదే పనిగా సంబంధిత పాఠ్యాంశాలను చదువుతూ ఉంటారని తెలిపారు. అయితే ఇటువంటి పోటీ పరీక్షలలో పాఠ్యాంశాలకు సంబంధించిన పరిస్థితులతో పాటు వాటికి సంబంధం లేని లోకజ్ఞానానికి సంబంధించిన అంశాలపై కూడా ప్రశ్నలు ఉంటాయన్నారు. రాజ్యసభ సభ్యునిగా ఉండి తొలిసారిగా భారతదేశ ప్రధానమంత్రి పదవిని పొందిన వారు ఎవరు ?, ఎన్నికల వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుంచి పార్లమెంటుకు నేటి వరకు జరిగిన 18 ఎన్నికలలో ఒకే గుర్తుపై ఎన్నికల బరిలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పోటీ పరీక్షల్లో ప్రతి మార్కూ కీలకం

నిలిచిన పార్టీ ఏది.. ? వంటి ప్రశ్నలు పాఠ్యాంశాలలో కనిపించవని, నిత్యం పత్రికలను అధ్యయనం చేయటం వల్ల, లోకజ్ఞానాన్ని అవగాహన చేసుకోవడం వల్ల మాత్రమే అటువంటి ప్రశ్నలకు సమాధానం లభిస్తుందని తెలిపారు. పోటీ పరీక్షలలో ఒకే ఒక్క మార్కు తేడాతో అనేక మంది అభ్యర్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోతున్న విషయం తెలిసిందేనన్నారు. అంతమాత్రాన నిరాశ చెందకూడదని, మరొక అవకాశం కోసం అభ్యర్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని అన్నారు. రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో ఒక్క డిఎస్‌సి పరీక్షా నిర్వహించలేదన్నారు. ప్రభుత్వం దిగిపోవడానికి ముందు డిఎస్‌సి నిర్వహిస్తున్నట్లు ప్రకటించి, అతి తక్కువ సంఖ్యలో ఖాళీలను చూపించి పరీక్షకు సిద్ధపడిందన్నారు. శాసనమండలి సభ్యునిగా ఉన్న తాను ఆధారాలతో సహా వాస్తవ ఖాళీల వివరాలను చూపించిన తర్వాత జరిగిన పరిణామాలను లక్ష్మణరావు తెలియజేశారు. గత ప్రభుత్వం ప్రకటించిన 6 వేల పోస్టులు కంటే తాజా ప్రభుత్వం ఎక్కువ పోస్టులు ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్సీగా తాము చేసిన పోరాటం ఫలితంగానే ఇది సాధ్యమైందని తెలిపారు. ఇక రాష్ట్రంలో డిఎస్‌సి పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు లక్షా 80 వేల మంది వరకు ఉన్నారని, పోస్టులు మాత్రం 16,347 మాత్రమే ఉన్నాయని అన్నారు. దీనిని బట్టే కాంపిటేషన్ ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన పోస్టులలో తాను కూడా ఒకటి దక్కించుకోవాలనే పట్టుదల ప్రతి అభ్యర్థిలో ఉంటే తప్పనిసరిగా విజయం సాధించవచ్చునన్నారు. పేదరికంతో ఇబ్బంది పడే అభ్యర్థులకు తాము శిక్షణ ఇస్తామని, దానికి ఎటువంటి ఖర్చూ ఉండదని భరోసా ఇచ్చారు. అటువంటి అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా 160 పేజీల విద్యా మనోవిజ్ఞాన శాస్త్ర మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పారిశ్రామికవేత్త, సామాజిక సేవకులు డాక్టర్ పికె.జోష్ విద్యా మనోవిజ్ఞాన శాస్త్ర మెటీరియల్ బుక్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో, రాష్ట్రంలో చదువుకున్న విద్యావంతులకు కొదవ లేదన్నారు. అయితే వారికి ఉపాధి మాత్రం దొరకడం దుర్లభంగా ఉందని తెలిపారు. చదువుతోపాటు నైపుణ్యం కూడా ఉంటేనే విజయం సాధ్యమన్నారు. నైపుణ్యం ఉంటే ఉపాధి గ్యారెంటీకి ఢోకా లేదన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ రైట్ టు వర్క్ విధానం ఉంటే నిరుద్యోగం ఉండదన్నారు. చైనా వంటి సోషలిస్టు దేశంలో ఆ విధానం అమలులో ఉందని, అక్కడ నిరుద్యోగం సమస్య లేదని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఆ దేశంలో ఉపాధి గ్యారెంటీ అన్నారు. మనదేశంలో అధికారంలో ఉన్న పాలకుల విధానాల కారణంగా చదువుకున్న విద్యావంతులకు సైతం ఉద్యోగాలు రావటం లేదని తెలిపారు. అందరికీ పని దొరికితేనే దేశం బాగుపడుతుందని అన్నారు. సోషలిజంతో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. బంగ్లాదేశ్‌లో సంక్షోభానికి, ఆ దేశ ప్రధాని హసీనా దేశం విడిచి పరారు కావటానికి అక్కడ నిరుద్యోగ సమస్యనే కారణమన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు తగిన శిక్షణ కార్యక్రమాలను అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ద్వారా తాము కొన్నాళ్లుగా అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.రాంబాబు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.సతీష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్, నాయకులు ఎం.ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

రుచి, నాణ్యతతో మధ్యాహ్న భోజనం

మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. ప్రస్తుతం 98 శాతంగా ఉన్న ఈ పథకం శత శాతం విద్యార్థులు వినియోగించుకునేలా కృషిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఎపిసి శ్రీనివాస్, డిఆర్‌డిఎ పీడీ ఎం.శోభారాణి, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీదేవి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మంగరాజును అభినందిస్తున్న కెజిహెచ్ వైద్యులు, సిబ్బంది

కెజిహెచ్ ఎఒగా మంగరాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కింగ్ జార్జ్ ఆసుపత్రి పరిపాలనా అధికారిగా ఎస్.మంగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందను కలిసి విధుల్లో చేరారు. ఇప్పటివరకు నగరంలోని ప్రభుత్వ మానసిక వైద్య కళాశాలలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఆయన తాజాగా కెజిహెచ్‌కు వచ్చారు. ఆయన గతంలో కెజిహెచ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. మంగరాజును కెజిహెచ్ మేనేజర్ పిఎం.జవహర్ లాల్, సీనియర్ అసిస్టెంట్లు బాలకృష్ణ, నూకరాజు, ప్రకాష్, శ్రీనివాస్, ప్రసాద్, పలువురు కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

చేనేత కళాకారులకు కలెక్టర్ ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకు చెందిన చేనేత కళాకారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ బుధవారం ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ఎడి వి.పద్మ, డెవలప్‌మెంట్ ఆఫీసర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

స్థాయి దక్కించుకున్న టిడిపి

(మొదటి పేజీ తరువాయి..)
యంత్రాంగం ముందుగానే పెన్సిల్, పెన్నులు, ఇతర పరికరాలేవీ తీసుకుని రాకూడదని నిబంధనలు జారీచేసినా 14 మంది కార్పొరేటర్లు అవేమీ పట్టకుండా పెన్సిళ్లు, పెన్నులు తీసుకొచ్చి బ్యాలెట్ పేపర్‌పై టిక్ మార్కులు చేయడం, కొట్టివేయడం చేశారు. జివిఎంసి తయారు చేసిన స్టాంప్‌తో తాము ఓటేయాల్సిన అభ్యర్థికి కేటాయించిన అంకెపై ముద్ర వేయాలి. బ్యాలెట్ పేపర్‌పై స్వస్తిక్ ముద్ర పడాలి..అంతేగానీ ఎలాంటి ఇతర మార్కులూ ఉండకూడదు. అలా వేయకుండా, కొంతమంది ఒకరికి వేయబోయి మరొకరికి వేసేసి తర్వాత పెన్ను, పెన్సిల్, స్కెచ్ పెన్నులతో దిద్దడం జరిగింది. దీంతో కౌంటింగ్ అనంతరం వైసిపి సభ్యులంతా తీవ్ర స్థాయిలో అభ్యంతరం తెలిపారు. మొత్తం 14 మంది కార్పొరేటర్లు ఈ స్థాయి సంఘ ఎన్నికల్లో ఇలా చేశారు. దీంతో ఆ ఓట్లపై వైసిపికి చెందిన కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, జియ్యాని శ్రీధర్ భగ్గుమన్నారు. జివిఎంసి కమిషనర్ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని, కౌంటింగ్ ప్రక్రియలో అక్రమాలకు ఆస్కారం ఏర్పడిందని వైసిపి సభ్యులు గలాటా చేశారు. తర్వాత బయటకొచ్చి మెయిన్ గేటు పోర్టుకో వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసిపికి చెందిన కార్పొరేటర్ పద్మావతిని మహిళా పోలీసులు మెట్ల వద్ద నుంచి ఈడ్చుకెళ్లడంతో ఆమె కన్నీళ్ల పర్యంతమయ్యారు. పలువురు జివిఎంసి కౌంటింగ్ కేంద్రంలోనే ఆందోళన, నిరసన తెలిపారు. పెన్సిల్ మార్కు ఉంటే అనర్హతగా ప్రకటించాలంటూ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కౌంటింగ్, ఫలితాలు ఉన్నాయని తాము కోర్టుకెళతామంటూ బాణాల శ్రీనివాసరావు, కట్టమూరి సురేష్, జియ్యాని శ్రీధర్ మీడియా ఎదుట చెప్పారు. తమ గెలుపును ఓర్వలేకనే వైసిపి నాయకులు ఆరోపణలు చేస్తున్నారని టిడిపి కూటమి ఎంఎల్ఎలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా స్థాయీ సంఘ ఎన్నికలకు సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తొలి నుంచీ చెప్పినట్టుగానే దూరంగా ఉన్నారు. సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్ టిడిపికి మద్దతుగా ఓటు వేశారు.



నిరసన తెలుపుతున్న వైసిపి కార్పొరేటర్లు, నాయకులు

వైసిపి కార్పొరేటర్లకు లభించిన ఓట్లు

సాడి పద్మావతికి 42, అక్కరమాని రోహిణికి 39, రెయ్యి వెంకటరమణకు 39, నక్కెళ్ల లక్ష్మికి 37, ఇమ్రాన్ మహమ్మద్‌కు 36, తోట పద్మావతికి 36, ఉర్రు వాణికి 36, పల్లా అప్పలకొండకు 32, కె.వెంకట నాగశశికళకు 25, బిపిన్ జైన్‌కుమార్‌కు 21 ఓట్లు వచ్చాయి.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు హాస్పిటల్‌ను పిపిపి పేరుతో ప్రైవేటీకరణ చేయవద్దని పోర్టులోని అన్ని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పోర్టులో అన్ని కార్మిక సంఘాల నాయకులూ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిపిపితో తలెత్తే పరిణామాలను వివరిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు విఎస్.పద్మనాభరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రామలింగేశ్వరరావు, విడిఎల్‌బి డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, ఎఐటియుసి అనుబంధ పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి డికె.శర్మ, సిఎఫ్‌టియు జాతీయ అధ్యక్షులు ఎన్.కనకరావు, ఐఎన్‌టియుసి అధ్యక్షులు చందు, వర్కర్స్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతామన్నారు.

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి - సీలేరు: ఆంధ్ర ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై చిత్రకొండ ఒపిహెచ్ పిసి కార్యాలయంలో రెండు రాష్ట్రాల జలవనరుల విభాగం రాష్ట్ర అధికారులు బుధవారం సమావేశమే చర్చించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బలిమెల జలాశయంలో 1487.90 అడుగులు నీటిమట్టం చేరుకోగా, బలిమెలలో 48.3825 టీఎంసీలు, జోలాపుట్ రిజర్వాయర్‌లో 2738.90 అడుగుల నీటి మట్టానికి చేరుకున్నాయి. ఇక్కడ 22.1459 టీఎంసీలు నీటి నిలువలు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బలిమెల జలాశయంలో ఈనెల చివరి నాటికి 22 టీఎంసీలు, జోలాపుట్‌లో 10.40 టిఎంసిలు నీరు వచ్చి చేరుతుందని లెక్కలు కట్టారు. బలిమెల, జోలాపుట్ రెండు రిజర్వాయర్లతో మొత్తం103.5284 టీఎంసీలు నీటి నిలువలు ఉన్నట్లు తేల్చారు. ఇందులో ఏపీ వాటా 53.8407 టీఎంసీలుగా ఒడిశా వాటా 49.6877 టీఎంసీలుగా పంపకాలు చేశారు.

నూతన క్రిమినల్ చట్టాలపై నేడు ఐలు నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా గురువారం ఉదయం విశాఖ జిల్లా కోర్టు అవుట్ గేటు వద్ద అఖిలభారత న్యాయవాదుల సంఘం (ఐలు) ఆధ్వర్యాన నిరసన తెలపనున్నారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బివి.రామాంజనేయరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కొత్త చట్టాలు అమలు వల్ల దేశంలో ప్రజాస్వామ్యానికి భంగం కలగడమే కాకుండా పౌరుల ప్రాథమిక హక్కులకు కూడా నష్టం జరుగుందని తెలిపారు. గురువారంనాటి నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కూటమి నేతలు అడ్డుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి నాయకులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అడ్డుకోవాలని సిఐటియు కంచరపాలెం జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 1229వ రోజుకు చేరాయి. దీక్షల్లో కంచరపాలెం జోన్ సిఐటియు నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో కూడా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీక్షల్లో ఎం.ఈశ్వరరావు, ఎస్.శ్రావణ్ కుమార్, జి.శ్రీనివాసరావు, ఎ.అప్పారావు, ఎ.రవి, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట:తెలుగు భాషను పరిరక్షించుకుందామని రిటైర్డ్ రసాయన శాస్త్ర అధ్యాపకులు కొయిలాడ రామ్మోహన్, జిల్లా సైన్స్ అధికారి నాగేశ్వరరావులు పిలుపునిచ్చారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తెలుగు భాష పై అవగాహనను బుధవారం కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, తెలుగు వెలుగును అందరికి పరిచయం చేయాలన్నారు

సంతలో సౌకర్యాలు కరువు



ఎండలోనే విక్రయాలు జరుపుతున్న పాడి రైతులు

ప్రజాశక్తి -పద్మనాభం: విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు సరిహద్దుల్లో ఉన్న సోమవారం సంతలో కనీస సౌకర్యాలు కానరావడంలేదు. సంతకు వచ్చే వారి నుంచి వసూళ్లు మాత్రం ఎక్కువనే చేస్తున్నారు. సౌకర్యాలు లేక అమ్మకాలు, కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయనగరం జిల్లా జామి మండలం అలమండ పంచాయతీ పరిధిలో అలమండ రైల్వేస్టేషన్‌కు సమీపంలో సోమవారం సంత జరుగుతుంది. ప్రతి సోమవారమూ జరిగే ఈ సంతలో సుమారు రూ.కోటి చేతులు మారుతాయి. సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ సొంత ప్రాంగణంలో నీడ లేని పరిస్థితి ఉంది. చెట్లు, చిన్నపాటి రేకుల షెడ్లు మాత్రమే ఉన్నాయి. సుమారు 150 గ్రామాలు, ఐదు పట్టణాల నుంచి వివిధ రకాల వ్యాపారస్తులు, కావలసిన వస్తువులు కొనుగోలు చేసుకోవడానికి వస్తుంటారు. ఉదయం 6 గంటలకే సంత ప్రారంభం అవుతుంది. ఎంత వ్యాపారం జరిగినప్పటికీ సంతలో సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ సంతకు పద్మనాభం మండలంలోని గంధవరం, కె.కొవ్వాడ, పి.కొవ్వాడ, పెంట, అనంతవరం, గొల్లలపాలెం గ్రామాల నుంచి వివిధ రకాల కూరగాయల తీసుకెళ్లి అమ్మకాలు చేస్తారు. మరి కొంతమంది మేకలు, గొర్రెలు, కోళ్లు, ఆవులు, గేదెలు తదితరాలు తీసుకెళ్లి అమ్మకాలు సాగిస్తారు. పద్మనాభం మండలం నుంచి సంతకి రాబడి ఉన్నప్పటికీ రైతులకు, వ్యాపారస్తులకు ఎటువంటి సౌకర్యాలూ కల్పించడంలేదు. వర్షం వస్తే అంతా బురదమయంగా ఉంటుంది. కనీసం కంకర రాయి వేసి అయినా గట్టిపరచడంలేదు.

సంత రోజు కిరాణా షాపులు, కిల్లి బడ్డీలు, హోటల్‌లో భోజనం అధిక రేట్లుకు విక్రయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంతకు వచ్చే వారికి తాగునీరు. పశువులకు నీటి తొట్టెలు, రైతులు, వ్యాపారస్తులు ఉండడానికి నీడ కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. సంత కొనసాగినంతసేపూ రైతులు నిలబడే ఉండాల్సి వస్తోంది. చెట్ల కింద కూర్చోవడానికి చిన్నపాటి బెంచీలు తాత్కాలికంగా ఏర్పాటుచేయాల్సి ఉన్నప్పటికీ సంత నిర్వాహకులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పశువులకు ప్రాథమిక చికిత్స కరువు

పశువులకు, రైతులకు ప్రాథమిక చికిత్స ఈ సంతలో కానరాదు. కొన్ని పశువులు సుమారు 50 కిలోమీటర్ల దూరం నుంచి వివిధ రకాల వాహనాలపైనా, కొన్ని నడిచి వస్తుంటాయి. ప్రయాణాల్లో జరుగుతున్న ప్రమాదాలు, మండుతున్న ఎండలకు నీరసపడితే వాటికి ప్రథమ చికిత్స అందాల్సిన బాధ్యత సంత యాజమాన్యంపై ఉంది. అయినా సంబంధం లేనట్టు నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు.

సంతలో వసూళ్ల వివరాలు

ఈ సంతలో ఒక కోడికి రూ.20, జత పశువులకు రూ.200, మేకలు, గొర్రెలకు రూ.100 వసూలు చేస్తున్నారని రైతుల చెబుతున్నారు. ఈ సంతలో కొనుగోలు చేసిన పశువుల్లో 40 శాతం కబేళాలలకు వెళ్తున్నట్లు సమాచారం. పశువులను లారీల్లో ఇరికించి, వాటిని ఇబ్బందులు పెడుతూ రవాణా చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా పోలీసులు, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



చిన్న వాహనంలో ఇరుకిరుకుగా ఇబ్బందిపడుతున్న పశువులు

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... యారాడ గ్రామానికి చెందిన పిళ్లా వెంకటప్పారావు (32) మధురవాడ నగరంపాలెంలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ మిధిలాపురి ఉడాకాలనీలోప్రయివేటు సంస్థలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటినుంచి విధులకని వెళ్లాడు. తెల్లవారే సరికి ఐటి కూడలి సమీపంలో ఉన్న తోటలో చెట్టుకు తాడుతో ఉరివేసుకొని మృతిచెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పిఎం.పాలెం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని మేనమామ గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

పిఎం.పాలెంలో చోరీ

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ బహుళ అంతస్తు భవనంలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. నేరవిభాగపు ఎస్ఐ రంభ శ్రీనివాసరావు కథనం ప్రకారం... పిఎం.పాలెం ఆఖరి బస్టాప్ వద్ద వైష్ణవి హిల్స్ 201, 401 ఫ్లాట్స్‌లో ముందు తలుపు పగలు గొట్టి ఇంట్లో ఉన్న సామానులు చిందరవందర చేశారు. ఇంట్లో వస్తువులేమీ చోరీకి గురికాలేదు. ఇంటి యజమానులు ఇతర దేశంలో ఉన్నారు. వీరు విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకున్నట్లు తెలిపారు. స్థానికులు సమాచారం మేరకు పిఎంపాలెం పోలీసులు, క్లూస్ టీమ్ వచ్చి వెలిముద్రలు సేకరించారు. ఇంటి యజమాని కె.సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలోని బోని పంచాయతీ రామినేనిపేట గ్రామానికి చెందిన పోతల నర్సింగరావు (54) అదృశ్యమైనట్లు ఆయన కుమారుడు వీరబాబు బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రామునేనిపేట గ్రామానికి చెందిన పోతల నర్సింగరావు ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం సుమారు12 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నర్సింగరావుకు మద్యం అలవాటు ఉందని తెలిపారు. నీలకుండీలు నుంచి పెందుర్తి వైపు నడుచుకుంటూ నర్సింగరావు వెళ్తున్నట్లు కొంతమంది తెలిపారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాలు, బంధువులు ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 6305633581 నెంబర్‌కు గానీ, స్థానిక పోలీసులకుగానీ సమాచారం ఇవ్వాలని కోరారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... చిట్టిబాబు కాలనీ ప్రాంతానికి చెందిన అప్పలస్వామి (54) ఆటో నడుపుతుంటాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకొని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

శారదానదిలో పడి తాపీ మేస్త్రీ మృతి

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి సమీపంలోని శారద నదిలో ప్రమాదవశాత్తు పడి తాపిమేస్త్రి మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర కథనం ప్రకారందేవరాపల్లికి చెందిన కొమ్మనాపల్లి అమ్మతల్లి (40) మంగళవారం సాయంత్రం చేపల వేటకు శారదానది ఒడ్డుకు వెళ్లి, చేపల వేట చేస్తుండగా కాలుజారి శారదానదిలో పడడంతో మృత్యువాత పడ్డాడు. మృతుడు తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. నాగేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట గ్రామ శివారులో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు బుచ్చయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. నిందితుల నంచి రూ 2570 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు 12లోగా దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో చేరేందుకు అర్హులైన, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 12వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి -తగరపువలస : ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి విద్యార్థులకు సూచించారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీ మోహన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీటు బెల్ట్ పెట్టని 25 మందిపై కేసులు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలంలో నాలుగు చక్రాల వాహనాలలో సీటు బెల్ట్ పెట్టని 25 మందిపై కేసు నమోదు చేసినట్లు డిఎస్ఐఒ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీలలో ఎంవిఐలు రాజారావు, సుధీర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి- ఆనందపురం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 14 మందికి జరిమానా విధిస్తూ భీమిలి మెట్రోపాలిటన్ జడ్జి తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు. ఇటీవల అనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి పట్టుబడిన 14 మందిపై కేసు నమోదు చేసి భీమిలి కోర్టుకు తరలించగా భీమిలి అదనపు మెజిస్ట్రేట్ డి.సౌజన్య ఒక్కక్కరికి రూ.పదివేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు అందని జీతాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి నేటికీ జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా నేషనల్ హెల్త్ మిషన్ యూనియన్ నాయకులు గోపీనాథ్, సురేష్, వీరబ్రహ్మం తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సుమారుగా 1500 మందికిపైగా పనిచేస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లుగా ఒక్క నెల కూడా సమయానికి జీతాలు అందలేదని, ఈ ప్రభుత్వంలోనైనా సక్రమంగా జీతాలు అందుతాయనుకుంటే జులై నెల జీతం నేటికీ అందలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, ఇఎంఐలు కట్టుకోడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇఎంఐలను ప్రతి నెలా వడ్డీతో కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. చాలామంది ఫీల్డ్ స్టాఫ్ ఉన్నారని, జీతాలు అందకపోతే వారు ఫీల్డ్‌లోకి ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. తక్షణమే జీతాలు ఇప్పించాలని జిల్లా, రాష్ట్ర అధికారులను కోరారు.

'స్థానిక' ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపు ఖాయం

బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి -ఆనందపురం : స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైసిపి గెలుపు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ తెలిపారు. భీమిలి నియోజకవర్గంలోని జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, కార్పొరేటర్లతో ఆనందపురం మండలంలోని బుధవారం బోయపాలెం ఈట్స్ అండ్ ట్రీట్స్ వద్ద ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ, ప్రలోభాలకు గురికాకుండా గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కూటమి నాయకులు ప్రలోభాలకు గురిచేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు, నాయకులకు ఏ సమస్య వచ్చినా అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బూడి ముత్యాలనాయుడు, కరణం ధర్మశ్రీ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కురసాల కన్నబాబు, బెల్లాన చంద్రశేఖర్, ముత్తంశెట్టి ప్రియాంక, బంక సత్యం, కోరాడ వెంకటరావు, వెంకటరావు, పాండ్రంకి శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

ఆనందపురం ఎంఇఒగా రవీంద్రబాబు బాధ్యతల స్వీకరణ



ఎంఇఒకు శుభాకాంక్షలు తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండల ఎంఇఒగా రవీంద్రబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆనందపురం ఎంఇఒ పద్మావతి ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఎంఇఒ 1గా రవీంద్రబాబుకు అధికారులు బాధ్యతలు అప్పగించారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన సిహెచ్ రవీంద్రబాబును స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో యుటిఎఫ్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ ఎంఇఒ 1, ఎంఇఒ 2 ఇద్దరూ సమర్థులైన అధికారులని, అందరి సహకారం, సమన్వయంతో మండల విద్యా శాఖను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బిఎన్‌వి.కిరణ్‌కుమార్, ఉప్పాడ రాము, సీనియర్ నాయకులు పి.దేవానంద్, దాసునాయుడు, ఎమ్.రాంజీ, రఘురాముడు, ప్రసాద్, మహిళా ఉపాధ్యాయులు కళావతి, కె.రమ్య, ఉమాబాల తదితరులు పాల్గొన్నారు.

25న బాలల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : సంస్కృతం ఆవశ్యకతను తెలియజేస్తూ మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఈ నెల 25వ తేదీన బాలల కేంద్రం ప్రారంభిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు మల్ల వెంకట్రావు తెలిపారు. మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్ కార్యాలయంలో సంస్కృత భారతి, మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వయసుతో సంబంధం లేకుండా పెద్దవారికి కూడా సంస్కృతం ఉచితంగా నేర్పించనున్నట్లు తెలిపారు. కందుకూరి సూర్యకుమారి మాట్లాడుతూ, బాల కేంద్రాలు, దశదిన శిబిరాలు అనేక చోట్ల ఉన్నాయని, పెద్దవారు సంస్కృతం నేర్చుకోవడానికి అనుకూలమైన అవకాశాలు ఈ ట్రస్టులో ఉన్నాయని చెప్పారు. ఉత్సాహవంతులు ఈ బాలల కేంద్రంలో పాల్గొని సంస్కృతం మాట్లాడడం నేర్చుకోవాలని మల్ల లక్ష్మి, చోడవరం జూనియర్ కాలేజీ లెక్చరర్ రేణుక కిషోర్, అంజలి శ్రీనివాస్, పేరి భార్గవి విజ్ఞప్తి చేశారు.

కొలెస్ట్రాల్ తగ్గడంలో స్టాటిన్స్ కీలకం

ప్రజాశక్తి -మధురవాడ : కొలెస్ట్రాల్ తగ్గడంలో స్టాటిన్స్ పాత్ర కీలకమని, ఎక్కువ కొలెస్ట్రాల్ ఉన్న వారిలో గుండె జబ్బులను తగ్గించడంలో ఉపయోగపడతాయని హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పరిమళ్ మిశ్ర పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కాలేయం ఉత్పత్తి చేసే కొలెస్ట్రాల్ మొత్తాన్ని తగ్గించడానికి సహాయపడతాయని, రెండోసారి గుండె పోటు రాకుండ నిరోధిస్తాయని వివరించారు. స్టాటిన్స్ మందులు కొలెస్ట్రాల్ తగ్గించడంలో ఎంత ముందుంటాయో శరీరంపై వాటి ప్రభావం కూడా అంతగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా కండరాల నొప్పి, కాలేయ సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ సందర్భంగా ఆయన శరీరంలో కొలెస్ట్రాల్ పెరుగుదలకు గుండె జబ్బులకు గల సంబంధాలను వివరించారు. స్టాటిన్‌ను ఆకస్మికంగా ఆపేయకుండా, వ్యాయామం ద్వారా కొలెస్ట్రాల్‌ను తగ్గించుకునే ప్రయత్నం చేయాలని, తరువాత వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి -తగరపువలస : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జల్ జీవన్ మిషన్ జిల్లా కో -ఆర్డినేటర్ ఆనంద్ సూచించారు. భీమిలి మండలం, సింగన బంద గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందుకు సంబంధించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, ఎఎన్ఎం పాల్గొన్నారు.

11న జూ పార్కులో చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 11న విద్యార్థులకు చిత్రలేఖనం, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలు నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా ఒక ప్రకటనలో తెలిపారు. మూడు విభాగాలుగా విభజించి ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒకటవ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులు పాల్గొనవచ్చని, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు పెయింటింగ్‌కు సంబంధించిన సామగ్రిని వారే తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాల కోసం 9440810213, 7893632900 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

1841 మందికి జనసేన సభ్యత్వం

ప్రజాశక్తి- పద్మనాభం: మండలంలోని 22 గ్రామపంచాయతీ పరిధిలో జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు 1841 మంది జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారని ఆ పార్టీ పద్మనాభం మండల అధ్యక్షులు కురిమిన రామస్వామినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యత్వం పొందిన జనసైనికుడికి బీమా సౌకర్యం పార్టీ కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు, అకాల మరణం పొందిన జనసేన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ అధ్యక్షతన, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు వెన్ని బంగారునాయుడు నేతృత్వంలో క్రియాశీలక వాలంటీర్ల కృషితో సభ్య నమోదు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రైల్వే ఒబిహెచ్ఎస్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- విశాఖపట్నం: సౌముక్ యాజమాన్యం నాలుగు నెలల బకాయి జీతాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైల్వే డిఆర్ఎం ఆఫీస్ వద్ద బుధవారం రైల్వే ఒబిహెచ్ఎస్ కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి రైల్వే ఒబిహెచ్ఎస్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ సౌముకు యాజమాన్యం కార్మికుల నాలుగు నెలల జీతాలను ఇవ్వకుండా ఎగ్గొట్టిందని, ఆ జీతాలను రైల్వే అధికారులు ఇప్పించాలని గత సంవత్సర కాలంగా రైల్వే కార్మికులు పోరాటాలు చేస్తూనే ఉన్నారని తెలిపారు. సెంట్రల్ లేబర్ ఆఫీసులో దీనిపై కేసు వేయగా జూన్ లోపు నాలుగు నెలల జీతాలను వేయాలని తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు. తీర్పు వచ్చి రెండు నెలలైనా జీతాలు ఇవ్వలేదన్నారు. కాంట్రాక్టర్ ఇవ్వకపోతే రైల్వే అధికారులు ఇవ్వాలని ఆ తీర్పులో ఉందని తెలిపారు. డిఆర్ఎమ్ బాధ్యత తీసుకొని నాలుగు నెలల జీతాలను వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ నాలుగు నెలల జీతాలు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఈ ధర్నాలో కార్మికులు సిహెచ్.హరి, ఎం.కిరణ్, బి.ఆనంద్, టి.రాము, టి.లక్ష్మణ్, పి.శ్రీను, కె.సత్తిరాజు, సిహెచ్.కన్నబాబు, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైల్వే ఒబిహెచ్ఎస్ కాంట్రాక్టు కార్మికులు

ఆక్రమణలు తొలగిస్తాం


ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పెందుర్తి : ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని తహశీల్దార్ వేణుగోపాల్ హెచ్చరించారు. జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్ సర్వేనెంబర్ 185లో కొద్దిరోజుల క్రితం మూడు పాకలను వేశారు. తహశీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ సాయి, ఇద్దరు విఆర్ఒలు, 12 మంది సచివాలయ విఆర్ఒలు, సర్వేయర్లు, ముగ్గురు పోలీసు సిబ్బంది వచ్చి మూడు పాకలను తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దారు వేణుగోపాల్ మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు ఎక్కడ ఆక్రమణలు జరిగినా వాటిని తొలగిస్తామని కబ్జాదారులకు హెచ్చరించారు.

తహశీల్దార్‌ను కలిసిన కూటమి నాయకులు

ప్రజాశక్తి -ములగాడ : ములగాడ తహశీల్దార్‌గా కొత్తగా నియమితులైన జె.తారకేశ్వరిని బిజెపి, టిడిపి, జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తహశీల్దార్‌ను సత్కరించారు.

పల్లాను కలిసిన కాశీవిశ్వనాథం

ప్రజాశక్తి-సీతమ్మధార : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును సీతంపేటలోని ఆయన ఇంటి వద్ద విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ అధినేత బొడ్డేటి కాశీవిశ్వనాథం బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.


పల్లాను సత్కరిస్తున్న కాశీవిశ్వనాథం

వేపగుంట - పినగాడి రోడ్డుకు మోక్షం లభించేనా?

ప్రజాశక్తి-పెందుర్తి: వేపగుంట నుంచి పినగాడి వెళ్లే రోడ్డు నిర్మాణానికి గత వైసిపి ప్రభుత్వం హయాంలో శంకుస్థాపన చేశారు. అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజు శంకుస్థాపన చేసి పనులు శరవేగంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు జరగలేదు. కూటమి వచ్చిన కొద్ది రోజులకే ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అధికారులు పిలిచి మూడు రోజుల్లో పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆర్ అండ్ బి అధికారులు ఆటంకం కలిగించడంతో పనులు మళ్లీ ముందుకు వెళ్లలేదు. సబ్బవరం వైపు ఇదే ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందో అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పలుచోట్ల రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని నిర్వహించారు. వేములవలస ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వరరావు రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.సుభాషిణి, ఉపాధ్యాయులు కె.లక్ష్మణరావు, టి.పద్మజ, రామయ్యమ్మ, స్వచ్ఛంద సేవకుడు కోరాడ రమణ పాల్గొన్నారు.


రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

తగరపువలస : ప్రముఖ రచయిత విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై భీమిలి మండలం సింగనబంద పంచాయతీ, కృష్ణంరాజుపేట ఎంపియుపి పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. జాతీయ గీతం జన గణ మనను రవీంద్రనాథ్ ఠాగూర్ రాశారని ప్రధానోపాధ్యాయులు జి.సత్యనారాయణ తెలిపారు. ఆయన రాసిన గీతాంజలి పుస్తకానికి నోబెల్ బహుమతి లభించినట్లు వివరించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి స్థాయీ సంఘ ఎన్నికల్లో 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు 60 ఓట్లతో విజయం సాధించడంతో ఆ వార్డుకు చెందిన టిడిపి నాయకులు మామిడి కిరణ్, వేణు, సత్యానంద, పలువురు నాయకులు కందువాతో సత్కరించి సంబరాలు చేసుకున్నారు. 94వ వార్డు అభివృద్ధిలో శ్రీనివాసరావుకు ఒక మార్కు ఉందని టిడిపి నాయకులు కొనియాడారు.

అసైన్డ్ భూముల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -ఆనందపురం : అసైన్డ్ భూములు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భీమిలి డివిజన్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బుధవారం ఆనందపురం తహశీల్దార్ శ్యాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. నూతనంగా వచ్చిన తహశీల్దార్‌ను కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బోనేలు ఏసేబు, సీయాద్రి రాంబాబు, దుమ్మెడ అప్పలసూరి, జలగడుగుల శ్రీనివాస్, ప్రొఫెసర్ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ హౌసింగ్ పథకంపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ హౌసింగ్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో హౌసింగ్ ఎపిడి ఆంజనేయులు మాట్లాడుతూ, మహాత్మాగాంధీ హౌసింగ్ పథకం ద్వారా ఇళ్లను పూర్తి చేయాలన్నారు. ఈ పథకంలో భాగంగా ఇల్లు మంజూరైన వ్యక్తికి 90 రోజులు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం వర్తిస్తుందని, వీటిపై అవగాహన కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. ఈ పథకం ద్వారా పెండింగ్‌లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయించాలన్నారు. మహాత్మాగాంధీ ఉపాధి పథకంలో పనులు చేసిన వారికి ఈ పథకం వర్తించదన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ తిరుమలరావు, ఎన్ఆర్ఇజిఎస్ ఈసీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కార్మికోద్యమ నేత సూర్యనారాయణకు ఘననివాళి



సూర్యనారాయణకు నివాళులు అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, వామపక్ష నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : సిపిఎం ఉమ్మడి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కార్మిక, గిరిజన ఉద్యమ నేత్ సూర్యనారాయణ పదవ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు సూర్యనారాయణ చిత్రపటానికి సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పూలమాలవేసి నివాళి అర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించారన్నారు. జిల్లాలో కుల వివక్షతకు వ్యతిరేకంగా సూర్యనారాయణ పోరాటాలు నిర్వహించారన్నారు. అనంతరం గిరిజన ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోట్లాడారని గుర్తు చేశారు. గిరిజన ప్రాంతంలో సిపిఎం అభివృద్ధికి కృషి చేశారని, కార్మిక నాయకుడిగా కాఫీ కార్మికులు, టూరిజం కార్మికులు, హాస్టల్ కార్మికులు, స్కీం వర్కర్ల సమస్యలపై అనేక పోరాటాలు సూర్యనారాయణ నిర్వహించారని నమ్మిన సిద్ధాంతం కోసం తన చివరి వరకు పోరాడారన్నారు. నేడు ప్రభుత్వాలు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల అవలంభిస్తున్నాయని, మరోవైపు మతోన్మాదం దేశంలో అశాంతిని సృష్టిస్తుందని ప్రజల మధ్య విభజన విభజన తీసుకొస్తుందని తెలిపారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి సీట్లు తగ్గినా నిరంకుశ విధానాలు మానుకోలేదని, దానికి వ్యతిరేకంగా పోట్లాడడమే సూర్యనారాయణ కు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శంకరరావు శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజన్న దొరబాబు, నాయకులు వైఎన్ భద్రం, కే శంకర్రావు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు బాలుగాడి, సిపిఎం మండల నాయకులు కే.తాళయ్య బాబు బి ఉమామహేశ్వరరావు, ఈశ్వరరావు, బూడిద నూకఅప్పారావు పాల్గొన్నారు.

పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షులు ఎం సూర్యనారాయణ వర్ధంతి సభ నిర్వహించారు. సిఐటియు స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు కొత్తూరు ఉమాభాస్కర్ రావు మాట్లాడుతూ నిస్వార్థంగా కార్మికులు, వారి హక్కుల కోసం, గిరిజనుల సమస్యలపై సూర్యానారాయణ పోరాడారన్నారు. విద్యార్థి ఉద్యమం నుండి కష్టజీవుల కోసం పనిచేసిన సూర్యనారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కార్మికోద్యమానికి తీరని లోటన్నారు. సూర్యనారాయణ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని, ఆయన అడుగుజాడల్లో ముందుకి నడవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఎం.సంతోష్ కుమార్, పి అప్పలరాజు, పి పైడిరాజు, భగత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.రమణ, ఎ.బంగారురాజు పాల్గొన్నారు.

కె.కోటపాడు.: మల్లారపు సూర్యనారాయణ వర్ధంతిని మండల కేంద్రంలో రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంగనవాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు పి భవాని. రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు. ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు మాట్లాడుతూ సూర్యనారాయణ చేసిన సేవలు కొనియాడారు ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సిపిఎం సానుభూతిపరులు పాల్గొన్నారు.


నర్సీపట్నం టౌన్ : స్థానిక కృష్ణాబజారు సెంటర్‌లో సిఐటియు పూర్వ జిల్లా అధ్యక్షులు ఎం.సూర్యనారాయణ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ కామ్రేడ్ ఎం.సూర్యనారాయణ విద్యార్థి దశ నుండి ఎస్ఎఫ్ఐ నాయకుడుగా విద్యార్థుల సమస్యలపై పోరాటం చేశారన్నారు. సిపిఎం సిద్ధాంతాలకు అకర్షితలై సిపిఎం జిల్లా నాయకులుగా ఏజెన్సీ ప్రాంతాంలో బాక్సైట్, నాతవరం మండలం సరుగుడులో లేటరైట్ తవ్వకాల వ్యతిరేక పోరాటంలో, పోడు భూములు, ఇతర సమస్యల పరిష్కారంకు పోరాడారన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులుగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ టి.ఈశ్వరరావు, ముఠా కార్మిక సంఘం నాయకులు నానాజీ, అప్పారావు, రాము, సాంబ, అప్పలనాయుడులు తదితర్లు పాల్గొన్నారు.



కె.కోటపాడులో అంగన్వాడీల నివాళి



పరవాడలో సిఐటియు నేతల నివాళి



నర్సీపట్నంలో నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు

మత్తు దరికి చేరొద్దు



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత రమణ

ప్రజాశక్తి- పరవాడ: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం రమణ అన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం రమణ మాట్లాడుతూ విద్యార్థులు యువకులు మత్తు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిపోతున్నాని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. గంజాయి మత్తు మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేచేసారు. విద్యార్థులు, యువతకు దీనిపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వపరంగా అధికారులు కూడా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అన్నివర్గాల్లో అవగాహనకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అర్జున్ స్థానిక నాయకులు సింహాద్రి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రలోభాలతో గెలిచేందుకు టిడిపి కుట్ర

ఉమ్మడి విశాఖ స్థానిక ఎమ్మెల్సీ వైసిపి అభ్యర్థి బొత్స



మాట్లాడుతున్న వైసిపి ఎమ్మెల్సీఅభ్యర్థి బొత్స

ప్రజాశక్తి-అనకాపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో తగినంత ఓటింగ్ బలం లేకుండా ప్రలోభాలతో గెలవాలని టిడిపి ప్రయత్నిస్తోందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైసిపి అభ్యర్థి బొత్స సత్యనారాయణ అన్నారు. బుదవారం స్థానిక రింగ్ రోడ్‌లోని వైసిపి కార్యాలయంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ సుమారు 600 పైచిలుకు ఓటింగ్ బలం వైసీపీకి ఉందని, అయితే టిడిపికి కేవలం 200 ఓటింగ్ బలంతో ఎలా నెగ్గుతారని ప్రశ్నించారు. తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి విలువలతో కూడిన రాజకీయం చేస్తారన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు అలవికాని హామీలను జొప్పించారని, అయితే నేడు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో చంద్రబాబును ఎందుకు గెలిపించామా అని ప్రజలు భావిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం వైసిపికి తథ్యమన్నారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యుఎ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, మాజీ మంత్రులు కన్నబాబు, బూడి ముత్యాల నాయుడు, మాజీ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బి వి సత్యవతి, చోడవరం మాజీ శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు, నియోజకవర్గ ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

ఖాతాదారుల వివరాలు సమర్పించాలి

ప్రజాశక్తి- కె కోటపాడు : మండలంలోని చౌడువాడ పిఎసిఎస్‌లో సంఘ ఖాతాలను కంప్యూటరీకరణ చేస్తున్న దృష్ట్యా సభ్య రైతులు, ఖాతాదారులు తమ పూర్తి వివరాలను పిఎసిఎస్‌కు అందించాలని సంఘ పర్సన్ ఇంచార్జ్ బి గీతావని కోరారు. రైతులు తమ భూమి పాసుపుస్తకం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, రెండు పాస్ ఫోటోలతో వివరాలు అందించాలని కోరారు. వివరాలు అందించిన వారు మాత్రమే సంఘ సభ్యులుగా కొనసాగుతారని స్పష్టం చేశారు.

విద్యుత్ లైన్ పునరుద్ధరణ

'ప్రజాశక్తి' కథనానికి అధికారుల స్పందన

నేలకూలిన స్తంభాలను సరిచేసిన కాంట్రాక్టర్



విద్యుత్ స్తంభాలు ఎత్తిస్తున్న కాంట్రాక్టర్.

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు నేల కూలిన నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ లైను లోని స్తంభాలు సంబంధిత కాంట్రాక్టర్ బుధవారం సరిచేశారు. నిర్మాణ సమయంలోనే విద్యుత్ స్తంభాలు కూలిపోవడంపై ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో దీనిపె బుధవారం ప్రజాశక్తిలో నేలకూలిన విద్యుత్ స్తంభాలు శీర్షికతో వెలుగులోకి తేగా విద్యుత్‌శాఖ అధికారులు ఎపిఇపిడిసిఎల్ ఎడిఇ గౌరీ శంకర్, ఎఇఇ చంద్రశేఖర్ స్పందించారు. నిర్మాణపనులు చేపడుతున్న సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. దీంతో జుత్తాడు వెళ్లే తారు రోడ్డు మార్గంలో యుద్ధ ప్రాతిపదికన నేలకూలిన స్థంభాలను సరిచేశారు. మరోసారి ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా పటిష్టంగా విద్యుత్ లైన్ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

టిడిపిలోకి వైసిపి కార్పొరేటర్ జంప్



టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా సమక్షంలో టిడిపిలో చేరిన భాస్కరరావు

ప్రజాశక్తి -అనకాపల్లి : జీవీఎంసీ అనకాపల్లి జోన్ 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, ఆమె భర్త 8వ వార్డు వైసిపి ఇన్‌చార్జి భాస్కరరావు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. విశాఖ టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్, అనకాపల్లి మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ సమక్షంలో చేరారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



33 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు రావులమ్మపాలెంలో జెడ్‌పి హైస్కూల్ 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కొత్తవలస దారిలో ఉన్న సూర్య రిసార్ట్‌లో బుధవారం నిర్వహించారు. .ఈ సందర్భంగా 33 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట కలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం విందు, వినోదాలను పంచుకున్నారు. గ్రూపులుగా ఫోటోలు దిగి సందడి చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సబ్బవరపు నారాయణమూర్తి,బోకం శ్రీను, బోకం జగదీష్, కిల్లి ముత్తుబాబు, కోటాన రాంబాబు, మండల దేముడు, నీటిపల్లి గంగాధర్, పరదేశమ్మ, రాజేశ్వరి, గంగమ్మ పాల్గొన్నారు.

ఎస్ఇ శ్యాంబాబుకు అభినందన



ఎస్ఇని అభినందిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-దేవరాపల్లి: : విశాఖ ఉమ్మడి జిల్లా ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇగా బాధ్యతలు చేపట్టిన శ్యాంబాబును యుఇఇయు (సీఐటీయూ)నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో యూనియన్ సీనియర్ నాయకులు కె .భాస్కరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, డిస్కం సెక్రటరీ పీవీడీ ప్రసాద్, రీజినల్ సెక్రటరీ ఆర్.సత్యారావు, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.అప్పారావు, స్టేట్ కమిటీ మెంబర్ అనకాపల్లి సెక్రటరీ పి.శ్రీనివాస్, ప్రెసిడెంట్ ఎల్ . నూకరాజు (జమీలు) నర్సీపట్నం డివిజన్ ప్రెసిడెంట్ కె . నాగప్పరావు, జిల్లా కమిటీ సభ్యులు బి . కొండలరావు,బి . రవిప్రసాద్, బి.రాము, ఎన్ . అవతారం, రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలకు బ్రేక్

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలకు బ్రేక్ పడింది. ఈ నెల ఒకటో తేదీన మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యులతో కూడిన పాఠశాల కమిటీ ఎన్నికలకు పాఠశాలల వారీగా నోటిఫికేషన్లను జారీ చేశారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు ఉండడంతో, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలను వాయిదా వేశారు. ఎపుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటించనున్నారు.

ఉత్తమ వరి సాగు పద్ధతులపై 'పొలంబడి'



కశింకోటలో వరినాట్లుపై అవగాహన కల్పిస్తున్న ఎఒ స్వప్న

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఏం. స్వప్న ఆధ్వర్యంలో బుధవారం గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి నారుమళ్ల యాజమాన్యం, వరినాట్లు వేసేటప్పుడు ఆకు చివర తుంచి నాటడం వల్ల ప్రయోసజనం, ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ద్రవజీవామృతం తయారీ, వాటి ఉపయోగాలు రైతులకు వివరించారు.కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్ఛార్జిలు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరి రైతులకు ఉత్తమ సాగు పద్ధతులపై అవగాహనకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి బి.భాస్కరరావు మాట్లాడుతూ, వరిలో ఉత్తమ సాగు పద్ధతులు అవలంభించడం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన, ఆరోగ్యకమైన పంటలను అధిక దిగుబడులతో పండించుకోవచ్చన్నారు.

కార్యక్రమంలో చోడవరం సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 14 వారాలపాటు ఉత్తమ సాగు పద్ధతులపై రైతుల కమతాలోల క్షేత్రస్థాయిలో పొలంబడి నిర్వహించి, సలహాలు సూచనలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో బంగారమెట్ట సర్పంచ్ మేలుసు బాబురావు, దొండ శ్రీను, దొండ వెంకటరమణ, సాయం వెంకటేష్ ,సాయం రఘునాథ్, సాయం రవి, బత్తుల శ్రీను ,బత్తుల వేణు ఎంపిక చేయబడిన రైతులు, లోపూడి వ్యవసాయ సహాయకులు బ్లెస్సీ రత్న ఇతర సిబ్బంది రైతులు పాల్గొన్నారు..

9న 'క్విట్ కార్పొరేట్' నిరసనను
జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు

ప్రజాశక్తి-అనకాపల్లి : సంయుక్త కిసాన్ మోర్చ, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సమావేశం బుధవారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఏఐటియుసి నాయకులు వైఎన్ భద్రం అధ్యక్షత వహించిన సమావేశంలో కిసాన్ సంయుక్త మోర్చా జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిందని, తన బలం పార్లమెంట్లో తగ్గినా, ప్రజా వ్యతిరేక విధానాలను ముందుకు వెళుతోందని మండిపడ్డారు. రైతులకు కనీస మద్దతు ధర చట్టం చేయలేదని, కేంద్ర బడ్జెట్లో ఎరువులు, పురుగులు మందులకు సబ్సిడీలు ఎత్తివేసారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల నష్టం కలిగించే చర్యలు చేపడుతున్నారన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వాడిని వెళ్ళగొట్టడానికి ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమానికి నాడు గాంధీ పిలుపునిచ్చారని, నేడు కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్లో కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చి, ప్రజలపై భారాలు వేశారన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు కోత పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. పౌష్టికాహార లోపంతో భారతదేశంలో ప్రజలు ఉంటే ఐసిడిఎస్‌లో కేంద్రబడ్జెట్‌లో రూ.300 కోట్లు నిధులు తగ్గించారన్నారు. ఇది పూర్తిగా కార్పొరేట్ బడ్జెట్ అన్నారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దొరబాబు మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న విధానాలు వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు కార్యక్రమంలో కిసాన్ సంయుక్త మార్చ కో కన్వీనర్ బాలు గాడి,కౌలు రైతు సంఘం కోశాధికారి కే తేలయ్య బాబు, రైతు సంఘం నాయకులు కోరిబిల్లి శంకర్రావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కే లోకనాథం, సిఐటియు జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, నాగిరెడ్డి సత్యనారాయణ, పి ఎన్ వి పరమేశ్వరరావు తదితరులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆగస్టు 9న క్విట్ కార్పొరేట్ దినంగా నిరసన చేయాలని పిలుపునిచ్చారు.

'చర్లోపల్లి' ఆయకట్టు రైతులను ఆదుకోవాలి



గ్రోయన్ పరిశీలిస్తున్న సిపిఐ, రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి-. అనకాపల్లి : శారదానది చర్లోపల్లి గ్రోయిన్ క్రింద ఉన్న ఆయకట్టుకు నీరందించి రైతుల్ని ఆదుకోవాలని సిపిఐ, ఏపి రైతు సంఘం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రైతులతో కలిసి సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోరుబిల్లి శంకరరావు చెర్లోపల్లి గ్రోయిన్ కాలువను పరిశీలించారు. వేలాది ఎకరాల సాగుకు నీరు అందించాల్సిన గ్రోయిన్ ఆనకట్టకు తలుపులు మరమ్మతుకు గురై సాగునీరు వృథాగా శారదా నదిలోకి పోతుందని, దీని వల్ల ఆయకట్టు భూములకు చుక్క సాగునీరు అందని పరిస్థితి ఉందన్నారు. దీనిపై నీటిపారుదల శాఖ అధికారులు గానీ, ప్రభుత్వ, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అక్కడనుండి ఇరిగేషన్ ఎఇతో ఫోన్లో సంప్రదించగా ప్రభుత్వానికి నివేదించామని, బడ్జెట్ వచ్చాక మరమ్మతులు చేపడతామని బదులిచ్చారు. చెర్లోపల్లి ఆయకట్టు రైతులు పొలమరశెట్టి రమణ బాబు, మాదేటి సూర్య ప్రకాష్ రావు, కొణతాల మాణిక్యాలరావు, బుద్ధ శివాజీ, కొణతాల గణేష్, కణితి నాగేష్ ,కాళ్ల వెంకటి, జి.ఆనంద్ తదితర రైతులు మాట్లాడుతూ అప్పటి దాకా మడులలోని వరినారుమళ్లను ఎలా బతికించుకోవాలని, నాట్లు వేస్తే వాటికి సాగునీరు ఎలా అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. . వెంటనే ఇసుక బస్తాలు వేసి చెర్లోపలి గ్రోయిన్ కాలువకు నీరు మళ్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులు రోడ్డెక్కవలసి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పార్టీ ఫిరాయింపులు
అప్రజాస్వామికం

ప్రజాశక్తి -అనకాపల్లి : ఒక పార్టీ, గుర్తుపై పోటీచేసి, ప్రజలు వేసిన ఓటర్లతో ఎన్నకోబడ్డ ప్రజాప్రతినిధులు ఆ పార్టీ అధికారంలో లేకపోతే, అధికారం ఉన్న పార్టీలో ఫిరాయించడం సరైనది కాదని సిపిఎం అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ తెలిపారు. ఒకవేళ పార్టీ మారాలనుకుంటే తమ పదవులకు రాజీనామా చేసి అప్పుడు పార్టీ మారాలన్నారు. రాజకీయ నాయకులు నైతిక విలువలు కట్టుబడి ఉండాలని, ఇష్టారాజ్యంగా పార్టీలు మారడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు.

పార్టీలు మారడం వల్ల పదవులు కోల్పోయేలా పార్టీ ఫిరాయింపుల చట్టం ఉన్నప్పటికీ దానిని అమలు చేయకుండా అధికార పార్టీలు తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని, ఇది ఓటర్ల మనోభావాలను అవమానించడమేనన్నారు. పార్టీ ఫిరాయించిన వారు వెంటనే పదవులను కోల్పోయేలా కఠినమైన చట్టాలను తీసుకొచ్చి అమలు జరపాలని డిమాండ్ చేశారు.భారతరాజ్యాంగంలో అందరికీ ఒకే విధమైన చట్టం ఉందని, అధికార పార్టీ నాయకులకు రాజ్యాంగం వర్తించదా? అని ప్రశ్నించారు.పార్టీ మారాలనుకుంటే, ప్రజల ద్వారా ఎన్నుకోబడ్డ పదవికి రాజీనామా చేసిన తర్వాతే మారేలా కఠిన నిబంధనలతో చట్టం అమలు చేయాలన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



సూచనలు చేస్తున్న డైట్ లెక్చరర్ మహాలక్ష్మి

ప్రజాశక్తి- కోటపాడు: చదువులో వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాన్ని ప్రతి ఉపాధ్యాయుడు పరిశీలించి ప్రత్యేక శ్రద్ధ చూపించాలని భీమిలి డైట్ లెక్చరర్ ఎం మహాలక్ష్మి సూచించారు.. బుధవారం ఏ కోడూరు జెడ్పి హైస్కూలు, కె.సంతపాలెం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులకు అనేక సూచనలు చేశారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సకాలంలో పాఠ్యాంశ బోధన జరుగుతుందా లేదా అని పరిశీలించారు. విద్యార్థులను సిలబస్‌పై పలు ప్రశ్నలను అడిగారు. విద్యార్థుల నోటుబుక్ కరెక్షన్ వర్క్, ట్యాబ్‌ల వినియోగం పరిశీలించారు. రక్తహీనత గల విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యాంశంలో వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని, వారి స్థాయిని పెంచడానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 డివిడి ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కె.కామేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టే వారిపై చర్యలు

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని ఇరువాడలో రైతులు జిరాయితీ పంటపొలాలకు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన మట్టిరోడ్డుకు అడ్డంగా భారీ ట్రెంచ్ కొట్టి అవరోధం సృష్టించిన రెవెన్యూ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దళిత సేన అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు డిమాండ్ చేశారు. బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్బవరం రెవెన్యూ అధికారుల అత్యుత్సాహంతో ఇరువాడ రైతులు రోడ్డు ఎక్కిన పరిస్థితి నెలకొందన్నారు. ఇరువాడ గ్రామంలో జాతీయ రహదారి 16 ప్రక్కనే సర్వే నెంబరు 108, 105లో సుమారు 50 మంది రైతులు చెందిన జిరాయితీ భూములకు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు వీలుగా జిరాయితీ భూముల్లోనే ఏర్పరచుకున్న మట్టి రోడ్డును రెవెన్యూ సిబ్బంది వచ్చి జెసిబితో లోతుగా త్రవ్వి, రైతులు తమ పొలాల్లోకి వెళ్లకుండా ఇబ్బందులు సృష్టించడం సరికాదన్నారు. దీనిపై అడ్డుకున్న రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేస్తున్నట్లు చెప్పడం శోచనీయమన్నారు. జాతీయరహదారి స్థలానికి సంబంధించి ఏదైనా సమస్యఉంటే సంబంధిత అధికారులు వచ్చి రైతులతో మాట్లాడాకే తగు చర్యలు చేపట్టాలే తప్ప, ఇలా రెవెన్యూ అధికారులు వచ్చి రోడ్డు స్థలాన్ని తవ్వి, రైతులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాగా ఇరువాడ రైతులు లిఖిత పూర్వక ఫిర్యాదు మేరకు స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జిల్లా రెవెన్యూ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.అయితే ఇదే గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు అనే వ్యక్తి స్వార్థపూరితంగాఅధికారులను తప్పు దోవ పట్టించి జెసిబితో మట్టిరోడ్డుకు అడ్డంగా ట్రెంచ్ కొట్టించారని రైతులు ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఇరువాడ రైతులు సాలపు తాతారావు, కర్రి దుర్గి నాయుడు, అప్పారావు ,కర్రి తాతారావు ,ఉల్లి పెంటయ్య ,ఉల్లి రాములమ్మ ,బలిరెడ్డి రాము, కర్రి సోమనాయుడు, మామిడి ముత్యాల నాయుడు, మామిడి దేవుడు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పెంటారావు, రైతులు

నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలి

ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి: వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకున్న తర్వాతనే పనులు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు కోరారు. మండలంలోని చందనాడలో బుధవారం నిర్వాసితులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వం కారిడార్ ఏర్పాటుకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు, భూమి లేని పేదలకు, దళితులకు, మత్స్యకారులకు, కల్లుగీత కార్మికులకు, రజకులకు, ఇతర పేదలకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ, సాగు భూములకు, చెట్లకు, ఇళ్ళకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఎన్నికల ముందు అధికారులు నిర్వహించిన గ్రామ సభల సందర్భంగా నిర్వాసితులు ఇచ్చిన దరఖాస్తులన్నింటినీ సర్వేలు చేసి వాటిని పరిష్కారం చేయాలని, ప్రతీ సెంటు భూమి కి, ప్రతీ చెట్టు కు పరిహారం, ప్యాకేజీ చెల్లించాలని తెలిపారు. చందనాడ దళితుల గుల్ల బట్టీలు, డీ ఫారం, సాగు భూములకు, మత్స్యకారుల సొసైటీ భూములకు, దోనివాని లక్ష్మీపురంలో పేదల సాగులో ఉన్న భూములకు నష్ట పరిహారం చెల్లించిన తర్వాత మాత్రమే పనులు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో చందనాడు గ్రామ సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్, నిర్వాసితులు జీ.గోవింద్, పె.సువర్ణరాజు, వై.మన్నియ్య, వై.విజయ్ కుమార్ పాల్గొన్నారు.


నిర్వాసితులతో మాట్లాడుతున్న అప్పలరాజు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మాదకద్రవ్యాల రవాణాపై నిఘా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణంలో మాధక ద్రవ్యాలు రవాణా జరగకుండా టౌన్ పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బుధవారం టౌన్ ఎస్ఐ సుధాకర్, సిబ్బంది ఆర్టీసీ కాంప్లెక్స్, పెద్ద బొడ్డేపల్లి ఏరియా, బలిఘట్టంలో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ, నర్సీపట్నం నుండి విశాఖపట్నం, ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలేదీ ?



విగ్రహాలను తొడగని ముసుగులు

ప్రజాశక్తి-కొత్తకోట: ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. రావికమతం మండలం కొత్తకోట పంచాయతీ కార్యాలయం వద్ద మాజీ ముఖ్య మంత్రి వైఎస్ఆర్, ఎన్ టి ఆర్ విగ్రహాలకు ఇప్పటి వరకూ ముసుగు వేయలేదు. బిఎన్‌రోడ్డులో స్థానిక మండల పరిషత్ పాఠశాల వద్ద ప్రస్తుత ముఖ్యమంత్రి బోర్డును తొలగించ లేదు. ప్రతి రోజు రెవిన్యూ అధికారులు ఈ బిఎన్ రోడ్డు వెంబడే ప్రయాణం చేస్తుంటారు. అయినప్పటికీ ఎన్నికల నిబంధనలు పాటించడంలో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి ఈ నెల 30న ఎంఎల్ సి ఎన్నికకు అవసరమయ్యే ఏర్పాట్లు ప్రభుత్వ యంత్రాంగం చేపట్టింది. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన నాయకులకు చెందిన ఫ్లెక్సీలను, భారీ కటౌట్లను తొలగించక పోవడం విశేషం. ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని ఉల్లంఘన లేకుండా చూడాలని కోరుతున్నారు.


కటౌట్‌ను తొడగని ముసుగు

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఒడిమెట్ట జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. మండలంలోని ముకుందరాజుపేటకు చెందిన భార్యాభర్తలు మామిడి రాంబాబు, సత్యవతి బైక్‌పై తునిలో వెంకటాపురం అత్తవారింటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఒడ్డిమెట్ట వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొని పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న అచ్యుతాపురం మండలం గొర్లి ధర్మవరంకు చెందిన నూకరాజు, అప్పలనాయుడు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడ్డ బాధితులను 108 వాహనంలో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాత కృష్ణదేవిపేటలో సర్పంచ్ పందిరి సత్యంనాయుడు ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. కాలువల్లో పూడిక తీయించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్థులు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను రోడ్లపై వేయరాదని చెప్పారు.

జగన్‌ను కలిసేందుకు తరలి వెళ్లిన నేతలు

ప్రజాశక్తి- నక్కపల్లి: మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని కలిసేందుకు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు తరలి వెళ్తున్నట్లు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, వైసీపీ నేత వీసం రామకృష్ణ తెలిపారు. నక్కపల్లిలో వైసీపీ కార్యాలయం నుండి బుధవారం వీరంతా వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో జగన్‌ను కలిసేందుకు తాడేపల్లి బయలుదేరి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు హాజరై పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీ నానాజీ, ఈశ్వరరావు, పాపారావు, తళ్ళ భార్గవ్ ,గంటా తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



తరలి వెళ్తున్న నేతలు


పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా గోదాదేవి మహోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో బుధవారం గోదాదేవి అమ్మవారి వార్షిక తిరునక్షత్ర మహొూత్సవం ఘనంగా నిర్వహించారు .అర్చకులు గొట్టుముక్కల వరప్రసా దాచార్యులు, సంకర్షణపల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు, పీసపాటి వేంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, నండూరి వేంకట అప్పల రంగాచార్యులు ఆధ్వర్యంలో నిత్యపూజా కార్యక్రమాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. దేవస్థానం ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, గ్రామానికి చెందిన రేజేటి సింగరాచార్యులు, నున్న సుభాష్, ఉపమాక పవన్ కుమార్ ఆచార్యులు, శ్రీవత్స పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం



బుచ్చయ్యపటలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని పెదపూడి గ్రామంలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంధ్యారాణి బుధవారం తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లలకు తల్లిపాలు ఇవ్వడంతో తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట : తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠమైనవని ఎంపిడిఓ శేషు బాబు అన్నారు మండలస్థాయి తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ, మానవహారం నిర్మించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎసిడిపిఓ శశికళ, వైద్యాధికారి యశోద, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఝాన్సీ, సుచరిత, ఆదిలక్ష్మి, వంశీప్రియ, అంగన్వాడీ కార్యకర్తులు పాలుగున్నారు

కె.కోటపాడు. : ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు భాగంగా బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్‌లో మూడు కూడలి వరకు ర్యాలీ చేపట్టి, మానవహారంనిర్వహించారు. అనంతరము ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలను పరామర్శించి బేబీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ మంగతాయారు మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను వివరించారు.కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

నక్కపల్లి: తల్లిపాలు బిడ్డకు సకల ఆరోగ్యాన్ని స్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత తెలిపారు. మండలంలోని ఒడ్డిమెట్టలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్వాడి వర్కర్స్, వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి తల్లిపాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణీలకు తల్లిపాలలో దాగివున్న పోషకాలపై అవగాహన కల్పించారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమన్నారు.

నాతవరం: మండలంలోని చమ్మచింత అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిఓ శ్రీ గౌరీ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు కచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. తల్లులు, గర్భిణీలు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బిపిసి కిరణ్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఎ.నాగజ్యోతి, ఎ.విజయలక్ష్మి, వెలుగు హెచ్‌డిసి సి.ఎర్రయ్యమ్మ, తల్లులు, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని చీడిగుమ్మల గ్రామంలోని అంగన్వాడీ -2 కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సీడీపీఎ శ్రీగౌరి తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు.అనంతరం గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ధనుంజయ్, మధుసూధనరావు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గొలుగొండ మండలంలో చేపడుతున్న సీమంతాలు

డుంబ్రిగుడలో ఏకధాటిగా వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో రెండు రోజులుగా తెరిపి లేకుండా రెండు రోజులుగా వర్షం కురుస్తుంది. ముసురుతో కూడిన వర్షంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కించుమండ సంతబయలులో బుధవారం జరిగిన వారపుసంతలో నిత్యావసరాల సరుకులు కొనడానికి, అటవీ ఉత్పత్తులు విక్రయించడానికి వచ్చిన గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. అరకు- పాడేరు ప్రధాన రహదారిలోని కుసుమగుడ హైవే రోడ్డు చిత్తడిగా మారింది. వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. బురదయ మార్గంలో గ్రావెల్ వేసే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

9 నుంచి బాల కార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:జిల్లాలో బాల కార్మికులను గుర్తించేందుకు ఈనెల 9 శుక్రవారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఎన్.సి.పి.సి.ఆర్.(నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటక్షన్ ఆఫ్ ఛైల్డ్ రైట్స్) మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకొని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం సాయంత్రం జరిగిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు అంశాలకు సంబంధించి జిల్లా అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. కార్మిక శాఖకు అన్ని విభాగాల అధికారులు పూర్తి తోడ్పాటు అందించాలని, బాల కార్మికులను గుర్తించే విషయంలో సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఆగస్టు 9 నుంచి 31వ తేదీ వరకు జిల్లా పరిధిలోని అన్ని కంపెనీలు, ప్రయివేటు వ్యాపార సంస్థలు, దుకాణాలు, ఫ్యాక్టరీలు, ఇతర పరిశ్రమలను తనిఖీ చేయాలన్నారు.14 ఏళ్ల లోపు వాళ్ళు ఎక్కడా కూడా పని చేయడానికి వీలు లేదని, సంస్కరణల తర్వాత 15 నుంచి 18 ఏళ్ల వరకు వయసు కలిగిన యువత నిర్దేశించిన సంస్థల్లో పని చేయొచ్చని స్పష్టం చేశారు.15 నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన వారు ప్రమాదం లేని కంపెనీల్లో మాత్రమే పని చేయాలని సూచించారు.నిబంధనలు అతిక్రమించి కార్యకలాపాలు సాగించే కంపెనీలపై దష్టి సారించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో వలస కార్మికులు ఎక్కువగా ఉంటారని, బ్రిక్స్ కంపెనీల్లో చిన్నారులను పనికి ఉపయోగించే అవకాశం ఉందని దీనిపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, కార్మిక శాఖ ఉప కమిషనర్ సునీత, ఎసిఎల్ రమాదేవి, డిఎస్‌వో సూర్యప్రకాశరావు, డిఈవో చంద్రకళ, ఎస్.ఎస్.ఎ. పివో శ్రీనివాసరావు, బిసి వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, డీఎంఅండ్ హెచ్‌వో జగదీశ్వరరావు, ఐసిడిఎస్,పోలీసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్

చేనేత కార్మికులను ఆదుకుంటాం

-జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-నక్కపల్లి:చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ విజయ కష్ణన్ అన్నారు. బుధవారం పాయకరావుపేట చేనేత సహకార సంఘ భవనంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శనను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చేనేత వస్త్రాలధారణ దేహానికి ఆరోగ్యాన్ని సమకూర్చుతాయన్నారు. స్వతంత్ర ఉద్యమంలో భాగంగా 1905 సంవత్సరంలో విదేశీ వస్త్రాలను బహిష్కరిస్తూ స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించే ఉద్దేశంతో స్వదేశీ ఉద్యమం నిర్వహించబడిందని, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 7 తేదీన జాతీయ చేనేత దినోత్సవం గా ప్రకటించినట్లు చెప్పారు. చేనేత కార్మికుల సంక్షేమానికి అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సంఘంలోని సీనియర్ చేనేత కార్మికులను సత్కరించారు. ఆప్కో సహాయ సంచాలకులు ఆర్.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ, మన దేశంలో ప్రాచీన కాలం నుండి చేనేత వస్త్రాలు తయారవుతున్నాయన్నారు. చేనేత కళాకారులు వస్త్రాల నేతలో అనేక రికార్డులను కూడా నెలకొల్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత అభివృద్ధి అధికారి రమణమ్మ, మండల రెవెన్యూ అధికారి, మండల ప్రజాపరిషత్ అధికారి పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి సన్మానం

కోటవురట్ల: చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రభుత్వ పాఠశాలలో కైలాస పట్నం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు రాపర్తి అప్పారావుకు సిబ్బంది సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి మాట్లాడారు. విద్యార్థులు చేనేత వస్త్రాలను ధరించి కార్మికులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నక్కపల్లి:సీజనల్ వ్యాధుల పట్ల అప్రమ త్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. బుధవారం పాయకరావుపేట పిహెచ్‌సిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, లోటుపాట్లు లేకుండా చూసు కోవాలన్నారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

గంభీరం వద్ద ప్రమాదాలను అరికట్టాలి

ప్రజాశక్తి-ఆనందపురం : ప్రమాదకరంగా మారుతున్న గంభీరం జలాశయం వద్ద పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని వేములవలస పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ కోరారు. వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందడం విచారకరమన్నారు. ఈ రిజర్వాయర్‌లో అడుగడుగునా ఊబి ఉందని, ఇది తెలియక విహారయాత్రకు వచ్చినవారు సరదాగా స్నానానికి దిగుతూ, ఊబిలో చిక్కి మృతిచెందుతున్నారని తెలిపారు. ఈ రిజర్వాయర్ వద్ద హెచ్చరిక బోర్డులు లేవని, దీనివల్ల పర్యాటకులు అప్రమత్తం కావడంలేదని తెలిపారు. తక్షణమే ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, శాశ్వత ప్రాతిపదికన సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:స్థానిక సంస్థల కోటాలో ఈ నెల 30 వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని, శాంతిభద్రతల సమస్య రాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఉమ్మడి జిల్లా ఎఆర్వోలను, పోలీసు అధికారులను ఉమ్మడి జిల్లాల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు .ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల అధికారులతో బుధవారం ఉదయం తన ఛాంబర్లో జేసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ నెల 30 వ తేదీన ఉప ఎన్నిక జరగనున్న క్రమంలో తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించి ఎన్నికను ప్రశాంతంగా జరిగేలా చూడాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితా రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సాంకేతికపరమైన విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలని సూచించారు. విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల ఎఆర్వోలు కె.మోహన్ కుమార్, కె.పద్మావతి, వై. శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్



ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది

రాజకీయ పార్టీల ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో మండలంలో పలు గ్రామాల్లో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికారులు తొలగిస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కేంద్ర ఎన్నికల సంగం ఆదేశాల మేరకు వచ్చేనెల 6వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది ఈ నేపథ్యంలో బుధవారం మండలంలో దిబిడి, రాజాం తదితర గ్రామాల్లో ఫ్లెక్సీలను తొలగించారు

కేరళ వరద బాధితులకు అండగా..

-ప్రజాశక్తి, సిపిఎం ఆధ్వర్యాన విరాళాల సేకరణ



రైతు బజార్‌లో విరాళాలు సేకరిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం ప్రజాశక్తి, సిపిఎం ఆధ్వర్యాన బుధవారం విశాఖ జిల్లాలో పలుచోట్ల విరాళాలు సేకరించారు. ప్రజలు తమకు తోచిన మొత్తాలను ఉదారంగా అందజేస్తూ సహృదయాలను చాటుకున్నారు.

ప్రజాశక్తి - విశాఖపట్నం : ప్రజాశక్తి సిబ్బంది బుధవారం ఉదయం హెచ్‌బి.కాలనీ, సీతమ్మధార రైతు బజార్ తదితరచోట్ల చేపట్టిన విరాళాల సేకరణకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. కార్యక్రమంలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు ఎన్.మధుసూదనరావు, జి.కాంతారావు, ఎస్.రాజేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. రూ.16,800 విరాళాల ద్వారా చేకూరింది.

గాజువాక : ప్రజాశక్తి ఆధ్వర్యాన వడ్లపూడిలో విరాళాలు సేకరించారు. వడ్లపూడి గాంధీ బొమ్మ సెంటర్ నుంచి జాతీయ రహదారి వరకూ విరాళాల సేకరణ జరిగింది. వై.సత్యనారాయణ, ఆర్‌కె.నాయుడు, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. రూ.7185 విరాళాల ద్వారా సమకూరింది.



రైల్వే న్యూ కాలనీలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు



వడ్లపూడిలో విరాళాలు సేకరిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

సీతమ్మధార : సిపిఎం ఆధ్వర్యాన రైల్వే న్యూ కాలనీలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ అక్కయ్యపాలెం జోన్ కార్యదర్శి రాజు, నాయకులు అప్పలరాజు, గౌరీష్, మాధవి, జ్యోతి, వెంకన్న, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అన్నవరం రోడ్డు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో అన్నవరం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్ద కాలంగా ఈ రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు శిధిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రజలు విద్యార్థులు రైతులు అన్నివర్గాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే రహదారిలోని భారీ గోతుల్లో నీరు నిండి చెరువులను తలపిస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు రాత్రివేళ ఎక్కడ ఎంతలోతు గొయ్యి ఉందో తెలియని స్థితిలో ప్రయాణం కష్టమౌతోందని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయినా తమ రహదారి కష్టాలను పట్టించుకోవాలని, రోడ్డులోని గోతులను పూడ్చడంతోపాటు పటిష్టంగా పునర్నిర్మించాలని స్థానికులు వేడుకుంటున్నారు.



అస్తవ్యస్తంగా ఉన్న అన్నవరం రోడ్డు